క్లుప్తంగా

బెండ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ గ్రామంలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు కూరగాయల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. బుధవారం ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని బెండ సాగు చేస్తున్న రైతులకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. పంటతో లాభాలు పొందేందుకు చేపట్టాల్సిన పొలం పనులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ప్రతినిధి మారుతీ, విజయ్, అఖిల్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు విరాళాలు



దాతలను సన్మానిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

వెల్దుర్తి(తూప్రాన్): హస్తాల్‌పూర్ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయ పునరుద్ధరణ పనులను దాతల సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఆలయ పునరుద్ధరణ పనులకు తమవంతు సాయంగా తాళ్ళపల్లి హరికృష్ణ, భాగ్యలక్ష్మి దంపతులు, నర్సింహంగుప్తా, పద్మ దంపతులు రూ.ఒక లక్ష చొప్పున రాములు, రత్నమాల దంపతులు రూ.21 వేలు, శ్రీనివాస్‌గుప్త రూ.25వేలు, పెంటయ్య, స్వరూప దంపతులు రూ.25 వేలు, విష్ణుమూర్తి ధనలక్ష్మి దంపతులు రూ.లక్ష పదహారు వేలు చొప్పున విరాళం అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ట్రస్ట్ నిర్వాహకులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, అనికె రాజు, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎస్‌ఐ

చిలప్‌చెడ్(నర్సాపూర్): బెల్ట్ దుకాణంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ షేక్‌మహబూబ్ అన్నారు. మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో మంగళవారం రాత్రి బెల్ట్‌పై దుకాణంపై దాడి చేసిన పోలీసులు అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నారు. బుధవారం ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గొండ్ల యాదాగౌడ్ అక్రమంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పన్నులు వసూలు చేయండి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో వందశాతం ఇంటి పన్ను వసులు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతీ నెల కరెంట్‌బిల్లు, ట్రాక్టర్ బిల్ చెల్లించాలన్నారు. హరితహారం మొక్కలను రక్షించాలని చెప్పారు.

'మాదిగలపై చిన్నచూపు తగదు'

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికల్లో మాదిగలకు సీట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలు చిన్నచూపు చూడడం తగదని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ఇప్పటికైనా పార్టీలు మాదిగలకు సీట్లు కేటాయించాలని లేదంటే జరగబోయే ఎన్నికల్లో పార్టీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, మండల అధ్యక్షుడు ఏసు, మండల ప్రధాన కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. తల్లి, కుమారుడికి గాయాలు

తూప్రాన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి తల్లికుమారుడికి గాయాలైన సంఘటన పట్టణ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. శివ్వంపేట మండలం చండీ గ్రామానికి చెందిన బంగారయ్య తన తల్లితో ద్విచక్ర వాహనంపై తూప్రాన్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే తూప్రాన్ – నర్సాపూర్ రహదారిపై కుక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తు బైక్‌పై తల్లి, కుమారుడు కిందపడి తీవ్ర గాయాలు అయ్యాయి. అటుగా వేళ్తున్న ప్రయాణికులు స్పందించి 108కు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాగునీటి గోస



వ్యవసాయ పొలం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు



రంగువానిపల్లిలో తాగునీటి కుళాయి వద్ద మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): మిషన్ భగీరథ తాగునీటి సరాఫర సక్రమంగా జరగడం లేదు. దీంతో మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామ పంచాయతీ మధిర గ్రామమైన రంగువానిపల్లిలో తాగునీటి సమస్య నెలకొంది. రెండు నెలలుగా సమస్యతో సతమతం అవుతున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న 20 వేల లీటర్ల ట్యాంకు కూడా మిషన్ భగీరథ నీరు నిండడంలేదని దీంతో గ్రామంలో ఒకటి, రెండు బిందెల నీరు కూడా రావడం లేదన్నారు. ఒక బోరుబావి ఉన్నప్పటికీ మోటార్ రిపేర్ ఉందని చెబుతున్నా.. పంచాయతీ సిబ్బంది బాగు చేయడంలేదన్నారు. తాగునీటి అవసరాల కోసం వ్యవసాయ బావుల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తమ సమస్యపై అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

జెడ్పీటీసీ వ్యాఖ్యలు అవాస్తవం

ఎంపీపీ సిద్ధరాములు

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించిన నిజాంపేట జెడ్పీటీసీ విజయ్‌కుమార్ వ్యాఖ్యలు అవాస్తవమని ఎంపీపీ అన్నారు. ఈ మేరకు బుధవారం నిజాంపేట బీఆర్‌ఎస్‌పార్టీ కార్యాలయంలో ఎంపీపీ, లబ్ధిదారులు కలిసి విలేకరులతో మాట్లాడుతూ... నందిగామ గ్రామంలో నిజమైన పేదలకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారన్నారు. నిజాంపేట జెడ్పీటీసీ అతని రాజకీయ లబ్ధికోసమే అనర్హులకు అందజేశారని అనడం అవాస్తవమన్నారు. కార్యక్రమంలో నందిగామ ఎంపీటీసీ సురేశ్, చల్మెడ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వై. వెంకటేశం, రంజిత్ గౌడ్, యాదగిరి, రాజగోపాల్, సూరా రాములు, బజార్ తిరుమల గౌడ్, ఎల్లం యాదవ్, మురళి, లద్ద స్వామి, లబ్ధిదారులు లద్ద రామవ్వ, సమ్మక్క, బుధవ్వ, శాంతమ్మ, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందిగామ లబ్ధిదారులు

బీసీలను విస్మరిస్తున్న బీఆర్‌ఎస్

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందరావు

చేగుంట(తూప్రాన్): బీసీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరిస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందరావు అన్నారు. బుధవారం చేగుంట మండలంలోని పెద్ద శివునూర్ తండాలో పలువురు యువకులు, నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 6 లక్షల జనాభా ఉన్న తెలంగాణలో ముదిరాజ్‌లకు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా బీఆర్‌ఎస్ పార్టీలో లేకపోవడం దీనికి నిదర్శనమన్నారు. బీసీబంధును ఇస్తామన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయం వరకు కాలయాపన చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంచంద్రం, మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, సాయిరాజ్, గోవింద్, ముదిరాజ్, గిరిజన తండా వాసులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని నందగోకుల్ గ్రామంలో ఇతర పార్టీలకు చెందిన 30 మందికి నిజాంపేట మండల జెడ్పీటీసీ విజయ్‌కుమార్ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామాయంపేట మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, జాల పోచయ్య, శ్రీకాంత్, ప్రశాంత్ గౌడ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కరుణాకర్, పిట్ల స్వామి, పిట్ల ఆంజనేయులు, మ్యాదరి నర్సింలు, అందే బాలయ్య, రాములు, ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న పెద్దశివునూర్ యువకులు

నీరుడి వ్యవస్థ లేక ఇబ్బందులు



మాట్లాడుతున్న రైతులు

హవేళిఘనాపూర్(మెదక్): ప్రభుత్వం గ్రామంలో ఉన్న నీరుడి వ్యవస్థ(వీఆర్‌ఏ)లను తొలగించడంతో తమ పంటలకు సాగునీరు సరఫరా చేసేవారు లేక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని శమ్నాపూర్ గ్రామ రైతులు ఆరోపించారు. గతంలో గ్రామంలో ఉన్న నీరుడి వారు అవసరం ఉన్న సమయంలో నీరును ఇప్పించి పొలాలకు పెట్టేవారని, ప్రస్తుతం ప్రభుత్వం వీఆర్‌ఏలను ఇతర శాఖకు బదిలీ చేయడంతో గ్రామంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇరిగేషన్ శాఖ వారు వీఆర్‌ఏలను మండలానికి ఇద్దరిని నియమించాలని అన్నారు. పొలాలకు సరైన సమయంలో నీరందక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు స్పందించి ఇరిగేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

మా గ్రామాన్ని ఎంచుకోవడం అభినందనీయం

నర్సాపూర్ రూరల్: అగ్రికల్చర్ విద్యార్థులు మా గ్రామాన్ని ఎంచుకోవడం అభినందనీయమని మండలంలోని రామచంద్రపూర్ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. బుధవారం మండలంలోని తునికిలోని డాక్టర్ డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం హాజరై, మాట్లాడారు. పది రోజులుగా మా గ్రామంలోని రైతులకు అగ్రికల్చర్ విద్యార్థులు భూసార పరీక్షలు, సస్యరక్షణ చర్యలు, రసాయన, సేంద్రియ ఎరువుల లాభనష్టాలతో అన్నిరకాల వ్యవసాయ సాగు పద్ధతులను వివరిస్తూ చైతన్య పరుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



సాగు పద్ధతులను వివరిస్తున్న విద్యార్థులు

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన విద్యార్థులకు సర్పంచ్ చప్పెట నర్సింహారెడ్డి ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. ఈ మేరకు బుధవారం చల్మెడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు రామాయంపేట వరకు ఉచితంగా నర్సింహారెడ్డి సొంత డబ్బులు చెల్లించి బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల రమేశ్, మాజీ సర్పంచ్ నారాయణ, స్వామి, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా దళితులు గుర్తుకు రాలేదా..!

హవేళిఘనాపూర్(మెదక్): తొమ్మిదేళ్ల పాలనలో గుర్తుకు రాని దళితులు ఇప్పుడు దళితబంధు ఇస్తామంటూ చెప్పి మోసం చేస్తారా..? అంటూ మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు ప్రశ్నించారు. బుధవారం గ్రామానికి వెజెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లగా వారికి చుక్కెదురైంది. గ్రామంలో అధిక శాతం ఉన్న ఎస్సీలకు ఏ ఒక్కరికి కూడా దళితబంధు ఇవ్వకుండా దగా చేస్తున్నారని వారిని దళితులు నిలదీశారు. తాము బీఆర్‌ఎస్ అభిమానంతో 9 ఏళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించుకున్నా.. తమ గ్రామానికి చేసిందేమీ లేదని వాపోయారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

బైండోవర్

శివ్వంపేట(నర్సాపూర్): అటవీభూమిని కబ్జా చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మగ్దుంపూర్ పంచాయతీ పరిధిలోని అటవీభూమిని బోజ్యతండా పంచాయతీ పరిధిలోని జగ్య తండాకు చెందిన గిరిజన రైతులు పూల్య, మీనాక్షి, శ్రీను, భిక్షపతి, రాజు, రవీందర్ అడివిలో అక్రమంగా చెట్లను నరికి భూమిని కబ్జా చేసినట్లు తెలిపారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసచారి ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర ఎన్నికల కోడ్ రావడంతో బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాత నేరస్తులను తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గృహలక్ష్మికి దళితులు అనర్హులా ?

అల్లాదుర్గం(మెదక్): గృహలక్ష్మి పథకానికి దళితులు అర్హులు కాదా అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో విలేకర్లతో మాట్లాడుతూ.. అల్లాదుర్గం గ్రామానికి గృహలక్ష్మి పథకం కింద 30 మందిని ఎంపిక చేశారని, ఇందులో ఒక్క దళితున్ని ఎంపిక చేయకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే గృహలక్ష్మికి ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, మధు, పాండు, విఠల్, నాగిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రేగోడ్(మెదక్): అందరికీ అందుబాటులో ఉంటానని, మరోసారి తనను గెలిపించాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రజలను కోరారు. మండల కేంద్రం రేగోడ్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. పార్టీ అభివృద్ధి, లోటుపాట్లపై చర్చించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశామన్నారు. ప్రతీ గ్రామానికి రూ.50 లక్షల నుంచి రూ.1కోటి వరకు నిధులు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎంతో కృషి చేశారని తెలిపారు. కరోనా సమయంలో కొంత ఇబ్బందులు వచ్చినా.. సంక్షేమాన్ని ఎక్కడా ఆపలేదన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే మిగిలిన పనులను పూర్తి చేస్తానని పేర్కొన్నారు. కాగా ఇటీవల చౌదర్‌పల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థిని వైష్ణవి కుటుంబాన్ని ఎమ్మెల్యే కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, సర్పంచ్‌లు సిద్ధారెడ్డి, తుక్కారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

20న స్మారక చెస్ టోర్నమెంట్

వెల్దుర్తి(తూప్రాన్): మాజీ ఎంపీపీ శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు, నిర్వాహకుడు రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. అండర్ –7, 9, 11, 13, 15 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు 18 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలకు సంబంధించిన ఫ్లెక్సీని బుధవారం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఇతర వివరాలకు 86391 79096, 97059 03846 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు సాంబయ్య, బాలరాజు, ప్రతాప్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకుడు

కుమ్మర సంఘానికి స్థలం కేటాయించండి

కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): కుమ్మర సంఘానికి మండల, తాలుకా కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం స్థలం కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద కుమ్మర సంఘం నియోజక వర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుమ్మరుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కుమ్మరులకు ఆధునిక పద్దతిలో కుండలు ఇతర మట్టిపాత్రలు చేయడంపై శిక్షణ ఇవ్వడంతో పాటు వందశాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలన్నారు. కుమ్మరులందరికి ఏకకాలంలో బీసీబంధు ఇవ్వాలన్నారు. మండల, నియోజవర్గంతోపాటు జిల్లా కేంద్రాల్లో స్థలం కేటాయించాలని చెప్పారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు...

కుమ్మర సంఘం నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఉపాధ్యక్షుడిగా బాలేశ్, కార్యదర్శిగా గంగాయ్య, కోశాధికారి శంకర్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడు గంగయ్య, యాదగిరి, వెంకటేశం, విక్రం, నాగేశ్, గణేశ్, హనుమంతు, పెంటయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకోత ప్రయోగం



పంటకోతను పరిశీలిస్తున్న అధికారి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటాపూర్ (కె) గ్రామంలో బుధవారం మొక్కజొన్న పంటలో పంటకోత ప్రయోగాన్ని రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో పంట కొత్త ప్రయోగం ఆధారంగా పంటలో ఎంత దిగుబడి వస్తుందో దాన్ని ఆధారంగా చేసుకొని రైతులకు విత్తనాలు, ఎరువులు, ధాన్యం సేకరణ కేంద్రాలు ఎంత అవసరం ఉంటాయో తెలుసుకొని సరిపడా అందుబాటులో ఉంచవచ్చన్నారు. అదేవిధంగా వరిలో మొగి పురుగు అధికంగా ఉండడంతో తెల్ల కంకి వస్తున్నట్లు తెలిపారు. దాని నివారణకు వరి పొట్టదశలో ఉన్నప్పుడే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సరైన మందును పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, రైతులు ఇంద్రసేన, వెంకయ్య తదితర పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నర్సాపూర్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



పెద్దశంకరంపేట(మెదక్): వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ శివకుమార్ హెచ్చరించారు. చౌరస్తాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం అక్కడి నుంచి ఎత్తివేసి హైదరాబాద్ మార్గంలో పట్టణ శివారులోని మల్లన్న ఆలయం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డబ్బు, ఇతర ఆభరణాలు తరలించే సమయంలో అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు వెంట తీసుకొని రావాలని, లేనిపక్షంలో నిబంధనల కన్న ఎక్కువ డబ్బు ఉంటే సీజ్ చేస్తామని చెప్పారు. చెక్‌పోస్ట్‌లో ఉన్న తమ సిబ్బందితో వాహనదారులు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలోని చేగుంట – మెదక్ రహదారిపై ఎన్నికల ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాల తనిఖీలు నిర్వహించారు. బుధవారం పద్మానాభస్వామి గుట్ట హైదారాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి భిక్షపతి, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు నిబంధనలను తప్పకుండా పాటించాలని పేట ఎస్‌ఐ.బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోళపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ ఓట్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లే వారు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, దానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్‌ఎస్‌లో చేరికలు**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి ఎంపీటీసీ సంతోష కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు బుధవారం మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సంతోష మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బాబు, మండల రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీకి చెందిన మండలంలోని ముగ్గురు ఎంపీటీసీలు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు పోతరాజ్ రమణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, నార్సింగి ఎంపీపీ సబితా, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి ఉన్నారు.

◆ **మండలాధ్యక్షుడికి మద్దతుగా బైక్ ర్యాలీ**

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంగళ్‌రావ్‌కు మద్దతుగా బుధవారం ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు వెంగళ్‌రావును అధిష్ఠానం పట్టించుకోవడం లేదని, కష్టకాలంలో పార్టీకి అండగా ఉండి నడిపించిన వెంగళ్‌రావును వదిలేస్తే పార్టీకి నష్టం జరుగుతుందని వడియారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ శాఖల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **బాలిక సంరక్షణపై విద్యార్థులకు అవగాహన**

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యోగా గురువు, ఐసీపీఎస్, మహిళా శక్తి కేంద్రం అధికారులు బాలిక సంరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా గురువు సురేందర్ విద్యార్థులకు యోగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక శారీరక ప్రశాంతత లభిస్తుందని చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు సంతోష, వసుమతి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగండి**

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగితే అనుకున్న లక్ష్యం చేరుకుంటారని ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ నర్సింహారెడ్డి చెప్పారు. బుధవారం అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చాన్నారు. జ్ఞాపకశక్తి పెంచుకోవడానికి పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్, బాలుర పాఠశాల హెచ్‌ఎం ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ గెలుపునకు కృషి చేయండి**

శివ్వంపేట(నర్సాపూర్): శక్తికేంద్రం ఇన్‌చార్జులు బీజేపీ గెలుపునకు కృషి చేయాలని పరిశీలకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ తెలిపారు. బుధవారం గూడూరులో శక్తికేంద్రం ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవి, అశోక్, మల్లేశ్, అనీల్, వేణు, పింకునాయక్, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్యకర్తలను పట్టించుకునే వారేరి**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలను పట్టించుకునే నాథులు కరువయ్యారని మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు రతన్‌లాల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలానికి సరైనా ఇన్‌చార్జి లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు సరైన వారికి అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఉపముఖ్య మంత్రి దామోదర రాజనర్సింహ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు చోటుమియాతో పాటు తదితరులు ఉన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని గాంధారిపల్లికి చెందిన సుమారు 50 మంది టీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మైనంపల్లి హన్మంత్‌రావు, రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కొత్తపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు దయానంద్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.